"ఏమంటున్నాడు?"

"రేపు సాయంత్రంలోగా శారదమ్మను వదిలేయకపోతే - రాధను చంపేస్తానంటున్నాడు."

"దుర్మార్గుడు-" పళ్ళు కొరుకుతూ అన్నాడు మురళి.

కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారందరూ.

"రంగా" పిలిచాడు నరసింహం.

"ఏం సార్?"

"ఏం చేద్దాం?"

"శారదమ్మను మాత్రం చంపిపారేయాల్సిందే సార్-"

మురళీ హఠాత్తుగా రంగామీదకు దూకి పిడికిలితో బలంగా అతని మొఖంమీద కొట్టాడు.

"రాస్కెల్ - నా రాధను చంపుకోమంటావా?"

దానికి ఏమాత్రం ఎదురు చూడకపోవడంతో రంగా వెనక్కు పడిపోయాడు. వెంటనే స్ప్రింగులా లేచి మురళి మీదకు దూకబోయాడు గానీ నరసింహం చప్పున ఇద్దరి మధ్యకూ వచ్చేశాడు.

"మావయ్యా! ముందు మనం రాధను రక్షించుకోవాలి! మా అమ్మను వాడు అడిగినట్లే వదిలేద్దాం! కావాలంటే రాధ మనింటికొచ్చాక మా అమ్మను నేను కిడ్నాప్ చేసుకొస్తాను."

నరసింహానికేమీ పాలుపోవటంలేదు. హరికృష్ణ బెదిరింపు గురించే ఆలోచిస్తున్నాడతను. నిజంగా వాడిని తను హతమార్చగలడా?

అసలు ఇదంతా వాడు ఆస్తి కోసమే చేస్తున్నాడా? ఆస్తికోసమే అయినట్లయితే తను వాడికి ఎంతోకొంత డబ్బ ఇచ్చి వదిలించుకోవచ్చు. డబ్బుతో పరిష్కారమయ్యే సమస్యలను పెంచి పెద్ద చేసుకోవటం ఎందుకు?

అయితే ముందు ఈ మురళీని ఓసారి పరీక్షించాలి. వాడు హరికృష్ణకి సహాయం చేస్తున్నాడో లేదో తెలుసుకోవాలంటే ఓ మార్గముంది. వాడు నిజంగా వాళ్ళకి సహాయం చేస్తున్నట్లయితే - తను ముందు వీడి పని పట్టాలి!

"మురళీ! నేనో నిర్ణయం తీసుకున్నాను!" అన్నాడు నరసింహం.

"ఏమిటి అది?"

"ఇవాళ రాత్రికి శారదమ్మను చంపిద్దాం-"

"రాధ సంగతి ఆలోచించకుండా ఎందుకు ఆ తొందర?"

"నీకెందుకు! రాధ క్షేమంగా ఇంటికొచ్చేట్లు నేను చూస్తాను?"

"ఎలా వస్తుంది - శారదమ్మను చంపిన సంగతి తెలిస్తే వాడు మనందరినీ చంపేయడం ఖాయం -"

"వాడివల్ల కాదది! వాడీ ఇంటి చుట్టుపక్కల కనబడితే చాలు చీల్చి చెండాడే జగజెట్టీలాంటి మనుషులు కాపలా ఉన్నారు."

"నామాట విను - రాధ ఇంటికి వచ్చేవరకూ మా అమ్మను ఏమీ చేయకు-"

"రాధకేమీ కాదని నేను చెప్తున్నాగా - నువ్వూరుకో-" విసురుకున్నాడు నరసింహం.

మురళీ నీరసంగా సోఫాలో కూలబడిపోయాడు.

"ఒరే రంగా-"

"ఏం సార్?"

"రాత్రి పన్నెండు తర్వాత శారదమ్మ నిద్రలో ఉన్నప్పుడు మన దగ్గరున్న ఇంజక్షన్ ఇచ్చేసేయ్ - శారదమ్మ ఎక్కడుందో తెలుసుగా - ఊరి బయట సత్రంలో" ఓరగా మురళిని చూస్తున్నాడు.

"అలాగే సార్-"

మురళి కోపంగా లేచి అక్కడినుంచి వెళ్ళిపోయాడు. "నాభార్య - నా భార్య-" అనుకుంటూ.

రాత్రి పదకొండవుతుండగా రంగా చప్పుడు కాకుండా నరసింహం గదిలోకొచ్చాడు.

"మురళీ అప్పుడే క్రిందకు వెళుతున్నాడు."

నరసింహం లేచి నిలబడ్డాడు.

"అంటే వాడు శారదమ్మను రక్షించడానికే ప్రయత్నిస్తున్నాడన్నమాట-"

"అవున్సార్-"

"అయితే వాడిని జాగ్రత్తగా వెంబడిద్దాం! తప్పక హరికృష్ణగాడి దగ్గరకు తీసుకెళతాడు శారదమ్మను-"

"అవునండీ - పదండి వెళ్దాం!"

ఇద్దరూ బయటకు నడిచారు.

## 18

మురళి కారు సత్రం ముందాగింది. కారు దిగి నడవబోయాడు. మురళీ - కానీ ఎదురుగ్గా హెడ్‌లైట్స్ వెలుగులో నరసింహం, రంగా, అతని అనుచరులు ఇద్దరు నిలబడి కనిపించారు.

మురళీ చూసి నరసింహం బిగ్గరగా నవ్వాడు.

"నేనిక్కడికొచ్చినట్లు మీకెలా తెలుసు మావయ్యా!"

నరసింహం మళ్ళీ నవ్వాడు "ఇవాల్టితో నీ ఆట కట్టురా మురళీ! నువ్వే హరికృష్ణ ఏజెంటుగా పని చేస్తున్నావని తెలిసిపోయింది."

"అబ్బా - ఏమిటి - నీ చెత్త డిటెక్షన్! వాడికి ఏజెంటుగా నేనెందుకు చేస్తాను?"

"లేకపోతే మా అందరి కళ్ళు గప్పి శారదమ్మను ఎందుకు విడిపిస్తున్నట్లు?"

"ఆ మాత్రం కూడా తెలీదా మావయ్యా......రాధకోసం నేనేం చేయమన్నా చేస్తాను-"

"కానీ వాడు రాధను పంపిస్తాడని ఏమిటి గారంటీ?"

ఎందుకు స్కోప్ ఇవ్వవు? ఒక్కసారి రాధను విడిపించుకున్నాక వాడి భరతం నేనెలా పడతానో నువ్వే చూస్తావుగా.''

నరసింహం మళ్ళీ సందిగ్ధంలో పడ్డాడు.

ఎన్నిసార్లు మురళిని అనుమానించి - ఋజువులు పట్టుకున్నా - ఏదొక సాకు చెప్పగలుగుతున్నాడతను. దాంతో తనకు మళ్ళీ పొరబాటు జరిగిందేమోనని అనుమానం వస్తోంది. ఈసారి ఫైనల్‌గా తేలిపోతోంది. అయినా తనకి కావాల్సింది శారదమ్మ కాదు - హరికృష్ణ.....అంతకన్నా ముఖ్యంగా ఆ హరికృష్ణకి మురళీ ఎంతవరకూ సాయం చేస్తున్నాడన్న విషయం!

"మురళీ'' అన్నాడు సాలోచనగా.

మురళీ నరసింహం వైపు చూశాడు.

"సర్లే......నువ్వు లోపలికెళ్ళి హరికృష్ణగా నీ అమ్మని ఇంటికి తీసుకెళ్ళు. ఇదిగో ఈ పిస్టల్ తీసుకెళ్ళు. ఏదో ఒక టైంలో హరికృష్ణ తల్లిని కలుసుకోవటానికి వస్తాడు. వాడిని కాల్చిపారేయ్! అప్పటి వరకూ నువ్వు హరికృష్ణగానే ప్రవర్తిస్తావు కాబట్టి ఆవిడకి అనుమానం రాదు. పోతే ఒక్క సంగతి. ఇది నీకు ఆఖరి అవకాశం. హరికృష్ణను చంపకుండా నువ్వు తిరిగొచ్చి మళ్ళీ ఏదో ఒక సాకు చెప్పావంటే మాత్రం క్షమించేది లేదు. రాధ నా కూతురైనా, నువ్వు నా అల్లుడివైనా మా ఇంట్లో నీకు ప్రవేశం వుండదు. నిన్ను దూరంగా ఫాలో అవుతూ వుంటాం...... హరికృష్ణ తన తల్లిని కలుసుకోవటానికి వచ్చేవరకూ నువ్వు అక్కడే వుంటావ్! కనబడగానే కాల్చేస్తావ్......ఓకే--'' పిస్టల్ అందిస్తూ అన్నాడు.

"ఒకే మావయ్యా. వాడిని చంపకుండా తిరిగొచ్చే పక్షంలో నువ్వు నన్ను కూడా నమ్మనవసరం లేదు, సరేనా?'' పిస్టల్ అందుకుని లోపలికి నడిచాడు.

నరసింహం, రంగా సత్రం పక్కనున్న చీకట్లో దాక్కున్నారు.

రెండు నిమిషాల్లో శారదమ్మని తీసుకొచ్చి మురళీ కారు ఎక్కించటం వాళ్ళ కంట పడింది. అది కదలగానే వెనుక కార్లో ఎక్కారు నరసింహం, రంగా.

వాళ్ళ కారు కదలబోయేముందే బాణంలా సాగిపోయింది మురళి - శారదమ్మలున్న కారు.

రంగా వేగంగా ఫాలో అవబోయాడు గానీ అప్పటికే చీకట్లో అదృశ్యమైపోయింది అది.

నరసింహం పళ్ళు పటపటా కొరికాడు. "సో.....నా అల్లుడే ఆ హరికృష్ణ ఏజెంట్ అన్నమాట'' అన్నాడు స్వగతంగా 'మొత్తంమీద ఒక ఆధారం దొరికింది! అదీ సంతోషం. ఆ మురళిగాడిని ఇంటికి రానీ! కారుని అంత వేగంగా ఎందుకు తీసుకెళ్ళవలసి వచ్చిందీ - ఈసారి దానికేం సాకు చెపుతాడో చూస్తాను......'ఈ విధంగా ఆలోచిస్తున్నాడు నరసింహం.

కారు ఇంటికి చేరుకుంది.

గేటుదగ్గర గూర్ఖా సెల్యూట్ కొట్టాడు.

"మురళీగారు -రాధమ్మగారు వచ్చేశారండీ-" అన్నాడు ఆనందంగా.

నరసింహం అదిరిపడ్డాడు.

"ఎప్పుడూ?"

"ఇప్పుడే - పదినిముషాలయిందండీ-"

నరసింహానికి మతి పోయినట్లయింది.

"రాధతోపాటు మురళికూడా వచ్చాడా?"

"అవునండీ! రామలింగం అయ్యగారు కూడా వచ్చారు వాళ్ళతో-"

"రామలింగం బావా!"

"అవునండీ. అన్నట్టు మన అల్లుడిగారి నడుముమీద పుట్టుమచ్చతో సహా అన్నీ చెకింగ్ చేశానండీ! అదీగాక అతను మురళీ అవబట్టే ఇంకా మనింట్లోనే ఉన్నారండీ! అదే హరికృష్ణయితే నిమిషాల్లో ఈ ఏరియా ఖాళీ చేసేస్తారు కదండీ!"

"అంటే వాడు ఇప్పటికీ ఇంకా ఇంట్లోనే ఉన్నాడంటావా?"

"అవునండీ! ఇంతకు ముందే మీరందరూ ఎక్కడి కెళ్ళారని అడిగారు....." అని ఘూర్ఖా అంటూ వుంటే రామలింగం పోర్టికోలోకి వచ్చాడు.

"అబ్బ - రాత్రంతా ట్రైన్‌లో ముగ్గురికీ నిద్రలేదు. ఇంటికొస్తే నువ్వులేవు. ఎక్కడికి వెళ్ళావు బావా! నువ్వొచ్చాక పడుకుందామని ఎదురు చూస్తున్నాం....రా.....రా..." అన్నాడు.

నరసింహంకేమీ బోధపడటంలేదు. ఒకవేళ నిజంగానే మురళీ, రాధా ఇన్నిరోజులూ రామలింగం దగ్గరే వున్నట్టయితే, ముగ్గురూ ఇపుడే వచ్చి నట్టయితే - మరి శారదమ్మను కార్లో తీసుకెళ్ళిందెవరు?

హ......రి......కృ........ష్ణ !

ఈ ఆలోచన రాగానే పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు.

రాధ, మురళి డైనింగ్ రూమ్‌లో కూర్చుని ఫలహారం చేస్తూ కనిపించారు.

నరసింహాన్ని చూసి ఆశ్చర్యపోయారిద్దరూ.

"ఎక్కడికెళ్ళావ్ నాన్నా రాత్రంతా? - అరె! బట్టలకు ఆ దుమ్మేమిటి?" అంది రాధ.

నరసింహం మాట రావటంలేదు.

"నా సంగతి సరేగాని రాధను నువ్వెక్కడికి తీసికెళ్ళినట్లు?"

"ఇంట్లో ఈ గొడవలెక్కువయిపోయాయి కదా! ప్రతిక్షణం నా పుట్టుమచ్చలు చూపించటం, గుర్తులు చెప్పటం, సంకేత పదాలు పలకటం - వీటితో విసిగిపోయాను మావయ్యా! రాధ కూడా నన్నసలు దగ్గరకు రానీయటంలేదు. మీద చేయి వేయబోతే చాలు కెవ్వుమంటూ అరచి పుట్టుమచ్చ అంటోంది. అన్నీ చూపించినా గానీ దానికి భయంగానే ఉంటోంది. ఈ పరిస్థితుల్లో ఇద్దరం సుఖంగా గడపాలంటే ఎవరికీ తెలీకుండా ఎక్కడికైనా వెళ్ళి

తెలియటం, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మళ్ళీ వాడేదయినా నాటకమాడటం జరుగుతుందని ఎవరికీ చెప్పలేదు. అందుకే రామలింగం బాబాయ్ ఇంటికి వెళ్ళిపోయాం. మూడొందల మైళ్ళ దూరంలో వున్న మమ్మల్ని వాడేం చేయగలడనుకున్నాం. నీ ఫోను మమ్మల్ని గాభరా పెట్టింది....."

నరసింహం రెండు చేతులతో తల పట్టుకున్నాడు.

"కానీ ఈ ప్లాన్ కూడా పని చేయలేదులే నాన్నా! మీరు ఫోన్‌చేసి నాపక్కనున్నతను హరికృష్ణ అని చెప్పేసరికి మా హనీమూన్ సర్వనాశనమయిపోయింది" అంది రాధ సిగ్గుతో.

"అసలు మేము రామలింగం బాబాయి ఇంట్లో ఉన్నట్లు నీకెలా తెలిసింది మామయ్యా! ఎలా ఫోన్ చేశావ్ అక్కడికి?" అడిగాడు మురళి.

నరసింహం నివ్వెరపోయాడు "నేను ఫోన్ చేయడమేమిటి - నువ్వేగా రాధ నీ దగ్గరుందనీ, శారదమ్మను వదలకపోతే రాధను చంపుతాననీ బెదిరించింది!"

"నేనా?"

"నువ్వంటే - అదే, ఆ హరికృష్ణగాడు-"

"హరికృష్ణా! అంటే నేను చేసే పనులన్నీ వాడికి ఏ క్షణానికాక్షణం తెలిసిపోతున్నాయన్న మాట! మేమున్న ఊరు టెలిఫోన్ ఎక్ఛేంజినుంచి ఫోన్ చేసి - ఆ ఎక్సటెంక్షన్ రాధకి అందజేశాడన్నమాట. మీ సంభాషణ అవగానే తిరిగి వాడు లైన్‌లోకి వచ్చివుంటాడు" అన్నాడు మురళి "నువ్వేమో అది రాధ పక్కనున్న నేనే మాట్లాడుతున్నాననుకున్నావు."

"ఈలోపులో మీ సంగతేమిటి నాన్నా! మీ బట్టలన్నీ అలా బురదతో నిండిపోయాయేమిటి?" అని అడిగింది రాధ తండ్రి మొహంలో బాధ చూడలేనట్టుగా మాటమారుస్తూ.

"ఇదీ ఆ హరికృష్ణగాడి పనే - మమ్మల్ని కార్లో ఫాలో అవమని, వాళ్ళమ్మని ఇంకో కార్లో తీసుకుపోయాడు. పైగా నా పిస్తోలు కూడా వాడికిచ్చాను" ఏడుపొక్కటే తక్కువగా అన్నాడు నరసింహం.

"పిస్తోలేమిటి? హరికృష్ణ ఏమిటి?" పక్కనుంచి రామలింగం అర్థం కానట్టు అడిగాడు.

మురళి విషయం వివరించి "నేను హాస్టల్లో ఉన్నప్పుడు నన్ను ఏడిపించినవాడు ఇంకా ఆ అల్లరి వదల్లేదు. పైన రాధని......." ఆపైన చెప్పటం ఇష్టంలేనట్టు ఆపుచేశాడు. ఈలోపులో నరసింహం రంగాని తన గదిలోకి తీసుకెళ్ళాడు.

"నీకేమయినా బోధపడుతుందా రంగా?"

"నాకేం తేలీటం లేద్సార్- ఆ హరికృష్ణగాడెవడోగానీ చాలా ఉద్ధండుడు అని మాత్రం చెప్పగలను. మనిద్దరినీ కూడా చిత్తుచేస్తున్నాడంటే తెలివితేటలు, ధైర్యం, తెగింపు చాలా పుష్కలంగా ఉన్నాయి వాడికి!"